# చెప్పుడు మాటలు

అనేక కంపెనీ ఆఫీసు.... ఆ ఆఫీసులో ఒక హాలు.

ఆ హాల్లో నక్కా నారాయుడు, కుక్కల కోటయ్య ఇంకా ఇతర స్టాఫ్ మెంబర్లు ఉన్నారు.

నక్కా నారాయుడు కుక్కల కోటయ్యవంక చూసి భావగర్భితంగా నవ్వాడు.

కుక్కల కోటయ్య నక్కా నారాయుడ్ని చూసి కన్ను కొట్టాడు ఎవరూ చూడకుండా.

నక్కా నారాయుడు దగ్గాడు. కుక్కల కోటయ్య గొంతు సవరించుకున్నాడు.

అందరూ ఫైళ్ళలోంచి తలలుఎత్తి వీరిద్దరివంకా చూశారు.

"అసలు మన ఎగ్జిక్యూటివ్‌కి బుద్ధిలేదోయ్...." అన్నాడు నక్కా నారాయుడు.

"ఎందుకు బుద్ధిలేదు ?...." అందరూ ఏక కంఠంతో అడిగారు.

"ఎందుకంటే.... ఎందుకంటె.... ఎందుకంటే.... ఆ ... ఆఫీసుకి తను లేటుగా వస్తూ మనల్ని పంక్చువల్‌గా రమ్మంటాడు.... అందుకు...." అన్నాడు కుక్కల కోటయ్య నక్కానారాయుడికి కన్ను కొడ్తూ.

వీళ్ళ మాటలు విన్న ఎకౌంటెంట్‌కి కాస్త హుషారు పట్టింది.

"వాడి పెధవాయే కాదు.... పరమ కిరాతకుడు.... నీచుడు.... దుర్మార్గుడు. నేను మొన్న తల్నొప్పిగా ఉందని పర్మిషనడిగితే డ్రాయర్‌లోంచి మాత్ర తీసిచ్చి వేస్కోమన్నాడు గానీ పర్మిషనివ్వలేదు...."

"పేరుకు తగినట్టు ఒట్టి సన్నాసి...." ఆఫీసు మేనేజరుకి కాస్త హుషారు పట్టి తాను ఓ మాట అన్నాడు.

నక్కా నారాయుడు కుక్కల కోటయ్య వంక చూసి మళ్ళీ కన్ను కొట్టాడు.

కుక్కల కోటయ్య నక్కా నారాయుడి నిచూస్తూ ఉషారుగా తనూ కన్నుకొట్టాడు.

నక్కా నారాయుడు నొసలు మీద అరచేత్తో ఫటాఫటా కొట్టుకుని "అబ్బా.... నీకు ఎప్పుడూ కొత్తే...." అని విసుక్కుని మరోసారి కుక్కల కోటయ్యకి కన్నుకొట్టి పెన్ను చూపించాడు.

కుక్కల కోటయ్య నాలుక కొరుక్కుని "సారీ గురూగారూ" అని టేబులు సొరుగులోంచి పుస్తకం పెన్ను తీసి రెడీగా పెట్టుకున్నాడు.

"ఏంటి?.... ఏంటి....?...." అంటూ అందరూ అడిగారు.

"అబ్బే మీకు సంబంధించినది ఏమీ కాదులే....

"మీరు కానీండి.... మీరు కానీండి...." అన్నారు ఇద్దరూ అందరి వంక చూస్తూ.

"ఆ.... ఎండాక వచ్చాం.... మన ఆఫీసు మేనేజరుగారు మన ఎగ్జిక్యూటివ్‌ని పేరుకు తగినట్టు వట్టి నన్నాసి.... అని తిట్టారు.... మరి నేనేనా తక్కువ తింది?.... మొన్న నేను శలవు పెడ్తే శలవా?.... ఎందుకు?.... ఏవిటి?.... అర్జంటా?.... అంటూ పెద్ద శాంక్షన్ చేసే వాళ్ళా నవాలక్ష ప్రశ్నలు వేసి చివరికి శలవులేదు పాడూలేదు.... బోలెంత పనుంది అన్నాడు దొంగ ముండా కొడుకు...." అన్నాడు స్టెనో రామేశ్వరం.

ఇహ ఇన్ని విన్న తరువాత హుషారు పట్టలేక చంకలు గుద్దు కుంటూ సంతోషంతో గంతులేస్తూ "నేను కూడా చెప్తా.... నేను కూడా తిడ్తా.... అంటూ" గంతులేయ సాగాడు అసిస్టెంట్ మేనేజర్ ఆనంద రావు.

"నువ్వెప్పుడూ అంతే.... చంకలు గుద్దుకోవడంలోనే టైమంతా వేస్టు చేస్తావు.... చెప్పేదేదో త్వరగా చెప్పుమరీ...." ఆనందరావుతో అని నక్కా నారాయుడు కుక్కల కోటయ్యవంక చూసి కన్ను కొట్టాడు.


కుక్కల కోటయ్య నక్కా నారాయుడ్ని మెచ్చుకోలుగా చూసి తనూ కన్నుకొట్టాడు.

"ఈ సన్నాసి రాజుగాడున్నాడే.... ఇక్కడ మన దగ్గరే పులి .... ఇంట్లో మాత్రం పిల్లే!. వాళ్ళావిడ దగ్గర కుక్కిన పేనులా ఉంటాడు.... ఇంట్లో చాకిరీ అంతా ఇతనిదే వాళ్ళావిడ చీరలు కూడా ఉతుకుతాడు...." అన్నాడు ఆనందరావు చంకలు గుద్దుకుంటూ.... "ఇంకా చెప్పనా?...."

"అన్నీ నువ్వే చెప్తే ఎలా? వేరేవాళ్ళకి కూడా ఛాన్సివ్వాలి!.... తిట్టాడు నక్కా నారాయణ.

కుక్కల కోటయ్య మాత్రం సీరియస్‌గా నోట్సు రానేస్తున్నాడు.

× × ×




ఆ రోజు సాయంత్రం ఆఫీసులో స్టాఫందరూ వెళ్ళిపోయాక నక్కా నారాయుడు, కుక్కల కోటయ్యా కంపెనీ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ సన్నాసి రాజు కాబిన్‌లోకి దూరారు.

"ఆ.... రండి.... రండి.... ఏంటోయ్ విశేషాలు?.... ఆ?.... అన్నాడు సన్నాసి రాజు వాళ్ళిద్దరితో.

"విశేషాలేంటని అడిగితే చాలా ఉన్నాయండి...." అన్నాడు నక్కా నారాయుడు.

మరి ఆలస్యం చేస్తారేం.... కూర్చుని అన్నీ చెప్పండి... త్వరగా చెప్పాలి మరి...." అన్నాడు సన్నాసి రాజు ఇద్దరినీ ప్రేమగా ఆప్యాయంగా చూస్తూ.

"మరేమో మన ఆఫీసులోని స్టాఫందరూ రోజు రోజుకీ చాలా దుర్మార్గులుగా తయారవుతున్నారండీ.... దేవుడ్లాంటి మనిషిని మిమ్మల్ని పట్టుకుని ఎంతెంత మాటలన్నారో!.... అన్నాడు కుక్కలకోటయ్య.

"నిన్న చెప్పారుగా.... ఈవేళ మళ్ళీ అన్నారా?...." ఆశ్చర్యంగా కళ్ళు ఇంతింత చేస్తూ అడిగాడు సన్నాసి రాజు.

"హయ్యో.... మీరిటువంటి మంచివారు.... అమాయకులు కాబట్టే వాళ్ళ ఆటలిలా సాగుతున్నాయి సార్....నిన్నటి తిట్లు నిన్నంటే ఈవాల్టి తిట్లు ఈవాల్టివే.. రోజుకో కొత్తరకం తిట్టు తిడ్తారు సార్ మిమ్మల్ని.. ."అన్నాడు నక్కా నారాయడు జాలిగా సన్నాసి రాజు వంక చూస్తూ.

సన్నాసి రాజు పళ్ళు బిగబట్టాడు.

"చెప్పండి....ఏమన్నారు?...."

నక్కా నారాయుడు కుక్కల కోటయ్యకి సౌజ్ఞ చేశాడు. కుక్కల కోటయ్య ఉదయం తను రాసిన నోటు పుస్తకం తెరిచాడు.

"హారే.... దీనికోసం మీరు రికార్డు కూడా మెయిన్‌టెన్ చేస్తున్నారా?...." ఆశ్చర్యంగా కాస్తంత ప్రేమగా చూశాడు వాళ్ళవంక.

"ఏదో మీమీద అభిమానం కొద్దీ సార్...." మెలికలు తిరుగుతూ నవ్వాడు నక్కా నారాయుడు.

కుక్కల కోటయ్య నోట్‌బుక్ రిఫర్ చేస్తూ ఎవరెవరు అతన్ని ఏమేమి అన్నారో చెప్పసాగాడు.

"సార్ మిమ్మల్ని అకౌంటెంటు పరమ కిరాతకుడు అని అన్నాడు సార్"

ఆ మాట వింటూనే సన్నాసిరాజు ముక్కుపుటాలు పొంగించాడు.

"అంతేకాదు, మీరు దుర్మార్గుడని అన్నాడు సార్"

"హబ్బా! ఈ బాధ భరించలేను" చెవులు మూసుకుంటూ ఆర్త నాదం చేశాడు సన్నాసి రాజు.

"ఇంకా మీరు నీచుడని కూడా అన్నాడు సార్" హుషారుగా చెప్పాడు కుక్కల కోటయ్య.

ఇహ బాధ భరించలేక తలని టేబుల్‌కేసి కొట్టుకుని కెవ్వు మన్నాడు.

"మీ తల పేపర్ వెయిట్‌కి కొట్టుకుంది సార్. అందుకనే గట్టిగా తగిలుంటుంది" అని టేబుల్ మీది పేపరు వెయిట్స్‌నీ, పిన్ కుషన్స్‌నీ అన్నీ పక్కకి జరిపి అతని ముందు స్థలంలో ఖాళీచేసి.

"ఇప్పుడు కొట్టుకోండి సార్" అన్నాడు నక్కా నారాయుడు వినయంగా.

"అప్పుడేనా? ఇంకా చెప్పనివ్వు" అన్నాడు సన్నాసిరాజు కుక్కల కోటయ్య వంక చూస్తూ.

"ఆఫీసు మేనేజరు మిమ్మల్ని సన్నాసి అన్నాడండీ. స్టెనో ఏమో మిమ్మల్ని దొంగముండాకొడుకని అన్నాడండీ. ఆనందరావేమో మీరు పెళ్ళామంటే భయపడి ఛస్తారని అన్నాడండీ." లిస్టు చదవసాగాడు కుక్కల కోటయ్య.

"హబ్బా.. హబ్బా.. హబ్బా.. హబ్బా.."అంటూ వర్సగా కుక్కల కోటయ్య చదువుతున్నంతసేపూ టేబుల్‌కేసి తల బాదుకున్నాడు సన్నాసి రాజు.

"ఇంక ఈవేళ్టికి చాలు సార్. ఇప్పటికే మీ నుదురు బూరెలా బుస్సున పొంగివుంది" ఇద్దరూ జాలిగా అన్నారు.

వాళ్ళకి తనపైన తన బాగోగులపైన వున్న ఇంట్రెస్టుని చూసి మనసు ద్రవించిపోయింది సన్నాసి రాజుకి. ఆనంద భాష్పాలు నిండిన కళ్ళతో వాళ్ళవంక చూసి ఇద్దరినీ ఒకరి తరువాత ఒకర్ని వర్సగాకౌగలించుకుని భోరుమన్నాడు.

"మీరుండబట్టి ఆఫీసులో జరిగే విషయాలన్నీ నాకు తెలుస్తున్నాయి. మీకు చెరో ఇంక్రిమెంటు శాంక్షన్ చేస్తున్నా" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ సన్నాసి రాజు.

చెప్పుడు మాటలు విని సన్నాసిరాజు ఆఫీసులోని స్టాఫ్‌నంతా బాగా పీడించసాగాడు.

తమని ముందు రెచ్చగొట్టి ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఏదో ఒకటి అనేలా చేసి తిరిగి ఆ మాటల్ని ఆయనకి నక్కా నారాయుడు, కుక్కల కోటయ్య చేరేస్తున్నారన్న విషయం అందరికీ తెలిసిపోయింది.

అందుకే వారి ఆట కట్టించడానికి ఒక ప్లాన్ వేశారు.

ఎప్పట్లా ఆ రోజు వీళ్ళందర్నీ టెంప్ట్ చేయాలని చూశారు నక్కా నారాయుడు, కుక్కల కోటయ్య. అయినా ఒక్కరూ పెదవి కదపలేదు. ఇలా లాభం లేదని కాస్త స్ట్రాంగ్‌గా రెచ్చగొడ్దాం అనుకున్నారు.

"సన్నాసి రాజుగాడు గాడిద" అని అందరి మొఖాల్లోకీ చూశాడు నారాయుడు. ఎవరూ అవునని కానీ, కాదని కానీ ఏమీ అనలేదు.

"వాడొట్టి బద్మాష్.. చూడు స్టాఫందర్నీ ఎలా పీడిస్తున్నాడో!!" అన్నాడు కుక్కల కోటయ్య.

ఊహూ.. అతన్ని సపోర్ట్ చేస్తూ ఒక్కరూ నోరెత్తలేదు.

ఇలా లాభం లేదనుకుని ఏకంగా బూతులే తిట్టడం మొదలుపెట్టారు —అలా అయితే కాస్త హుషారు పుడుతుందని.

అయినా ఎవరూ తొణకలేదు బెణకలేదు.

అయినా సరే ఆ రోజు సాయంత్రం నక్కా నారాయుడు, కుక్కల కోటయ్యా సన్నాసి రాజు క్యాబిన్‌లోకి వెళ్ళారు. వాళ్ళేమీ అనకపోయినా అన్నారని కల్పించి చెప్దామని.

"సార్ సార్ ఈవేళ ఎంత ఘోరం జరిగిపోయిందనీ" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

సన్నాసిరాజు వాళ్ళవంక సీరియస్‌గా చూశాడు.

"అవును. చాలా ఘోరం జరిగిపోయింది. వినండి" అన్నాడు టేబుల్ డ్రాయర్‌లోంచి టేప్ రికార్డు తీసి ప్లే బటన్ నొక్కుతూ.

ఆ టేపు విన్న నక్కా నారాయుడు, కుక్కల కోటయ్యా ఇద్దరూ మూర్ఛపోయారు. అది ప్రొద్దున్న తాము సన్నాసిరాజుని తిడుతుంటే ఎవరో రికార్డు చేసిన టేపు!!

రెండ్రోజుల్లో వాళ్ళిద్దరికీ మారుమూల అడవుల్లోకి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి.

ఇంకెప్పుడూ సన్నాసిరాజు చెప్పుడు మాటలు వినలేదు.

[ఇది కథ కాబట్టి నారాయుడికీ, కోటయ్యకీ గుణపాఠం నేర్పడం, సన్నాసిరాజుకి కళ్ళు తెరుచుకోవడం జరిగింది. కానీ నిజ జీవితంలో ఆఫీసుల్లో అలాంటి చెంచాగాళ్ళు వాళ్ళ మాటల్ని నమ్మే మూర్ఖులైన ఆఫీసర్లు ఎందరో ఉంటారు — వాళ్ళెవరూ మారరు.

❋